# అన్నయ్య

– పుల్లెల రామకృష్ణారావు (13)

...వెధవది. నేనంటే అందరికీ అలుసే. ముఖ్యంగా అమ్మకో! అన్నయ్యకు. నేనంటే ఎప్పుడూ ముక్కుమీదే ఉంటుంది వాడికి. లేకపోయినా ఏదో కల్పించి పురమాయిస్తాడు, "అది చెయ్యి! ఇది పట్రా!" అని. ఈమాటు ఛస్తే వీడు చెప్పిన పని చెయ్యను. ఇంతకీ వీడి గొప్ప ఏమిటో! వెధవ ఇంటరు పాసయ్యాడు. అంతేగా, నాలా బొంగరం గువ్వాకొట్టి తిప్పగలడా? పోనీ చేతిలోకి తియ్యమను, చూద్దాం; ఏదీ చేతకాదు. పైగా వాడేదో కలక్టరయినట్టూ, నేను వాడికింద నౌకరయినట్టూ మాట్లాడతాడు.....అనుకుంటూ గుమ్మంలోకి అడుగు పెట్టాను.

"ఒరేఁ! కృష్ణా! ఇలా రా!" అని నాన్నగారు పిలిచారు. ఇంటికి రాగానే కాఫీ తాగి ఆడుకుందికి పోదామనుకుంటున్న నాకు నిరుత్సాహం పుట్టింది. "ఎందుకు నాన్నగారూ!" అంటూ లోపలికి వెళ్లాను. నాన్నారు ఒక రూపాయి కాగితం చేతికి ఇచ్చి, "వెళ్ళి అతిబాబు కొట్లో అరవీశె పంచదార పట్రా" అన్నారు. ఇంకా కాఫీ పెట్టలేదూ? అదేదో ముందరే అన్నయ్యగాడి చేత తెప్పించిపెడితే బాగున్నే! ఇంతకీ వా డెక్కడో తిరుగుతూంటాడు. నేనే చచ్చినట్టు అన్నీ చెయ్యాలి... అనుకుంటూ బయలుదేరాను. ఎందుకంటే నాకు వేళకి కాఫీ లేకపోతే తలకాయనొప్పి పట్టుకొంటుంది.

నేను పంచదారా చిల్లరడబ్బులు పట్టుకొని ఇంటికి వచ్చాను. లోపల నుండి ఏవేవో మాటలు వినబడుతున్నాయి.

బహుమతి పొందిన కథ

"ఏమండీ! మన పెద్దాడిని ఎందులో నేనా ప్రవేశపెట్టండీ! వాడూ నాలుగు రాళ్ళు తెస్తే వేణ్ణీళ్ళకు చన్నీళ్ళలా ఉంటుంది." అంటోంది అమ్మ.

నేను వెళ్ళి కాఫీ కలుపుతూన్న అమ్మకి పంచదార ఇచ్చేను.

"నిండా పద్దెనిమిదేళ్ళు లేవు. వీడి కెవరిస్తారే ఉద్యోగం. మహామహా బియ్యేలు, ఎమ్మేలకే లేక ఇంట్లో నానుతూఉంటేనూ," అన్నారు నాన్నగారు.

"అలా అనకండి. ఏ పుట్టలో ఏ పాముందో! ప్రయత్నిస్తే దొరకొచ్చు! వాళ్ళ మూర్తి వీడికన్నా రెండు నెల్లేగా పెద్ద; వాడికి దొరికితే వీడికి దొరకదూ?" అంది అమ్మ.

"మీ ఆడవాళ్ళకి అదో చాదస్తం. కాని, నువ్వు చెప్పినట్లు వాడిని కలకత్తా, బటాచార్జి గారి దగ్గరికి పంపిద్దాం."

* * *

అన్నయ్యగోల నాకు కొన్నాళ్లేనా విరగడ అవుతుందికదా అని సంతోషపడ్డాను. "కనకమహాలక్ష్మీ! తల్లీ! మా అన్నయ్య నెల్లాళ్లేనా ఆ ఊళ్లో ఉండిపోతే నీకు పాతిక కొబ్బరికాయలు కొడతాను" అని మొక్కుకున్నాను కూడా. ఎందుకంటే అన్నయ్య ఎప్పుడూ "ఒరేఁ! కిష్టిగా! నిన్న చెప్పిన హోంవర్కు చేశావురా? నేను చెప్పిన సైన్సు పాఠం చదివావా? ఇవాళ ప్రశ్నలడుగుతాను తెలుసా. The Beggar Maid అన్న పద్యం రాత్రికి తప్ప చెప్పకపోతే వీపుమీద రంపోలు

"వాయిస్తాను తెలుసా!" అంటాడు. పైగా ఎప్పుడు చదువుకుందికి పోయినా, సి. ఐ. డి. లా వెనకాలే వచ్చి, "ఒరే! కృష్ణా! ఎక్కడికిరా మిట్ట మధ్యాహ్నం. (సాయంత్రం మూడు గంటలయినా మా అన్నయ్యకి మిట్టమధ్యాహ్నమే లెండి.) పోయి ఆ పుస్తకం తీసి చదువుకో" అని టేబిలుమీద ఉన్న నా ఇంగ్లీషు పుస్తకం చూపెడతాడు. పోనీ, చదువుకోమన్నాడుకదా! అని ఏ పత్రికో తీసి చదువుతూంటే, వెనకాలే వచ్చి వీపుమీద ఒక్కటి చరిచి, "వెధవా! 'నీ క్లాసుపుస్తకం చదవరా' అంటే ఈ చెత్తంతా ఎందుకురా?" అంటాడు. మళ్ళీ 'ఆ చెత్తంతా ఎందుకు' అని ఏ ఇంగ్లీషు మేగజైనో ఇచ్చి చదవమనేవాడు. "నా క్లాసు పుస్తకం కాదుకదా! ఇది చదవటం ఎందుకన్నయ్యా" అన్నా ననుకోండి. "చదవాలోయి వెధవాయి. అడ్డు పుల్ల వెయ్యక. ఇలాంటివి చదవక పోతే రేపొద్దున దమ్మిడీకి మారవు" అంటాడు. ఆ బాధ తప్పుకోడానికి నాకు నచ్చిన పుస్తకం ఏ ఇంగ్లీషు మేగజైనులోనో పెట్టి చదివేవాణ్ణి. ఇప్పుడు వాడూరికి పోతే నా ఇష్టం వచ్చినట్టు తిరగొచ్చు, ఆడుకోవచ్చు. నాకే బాధా ఉండదు.

ఆ వేళ, అన్నయ్య ప్రయాణం. వాడి చేతికి ఓ ఉత్తరం, నూరు రూపాయలూ ఇచ్చి "జాగ్రత్తగా వెళ్ళిరా!" అన్నారు నాన్నగారు. అందులో ఒక రూపాయి తీసి నా చేతికి ఇచ్చి "ఒరే! జాగ్రత్తగా చదువుకో. వెధ వ్వేషాలెయ్యక. ఇంద. ఇది తీసికొని ఏం చేసి కొంటావో చేసికో" అన్నాడు. నేను ఇంటికి వెళ్ళి మూలకూచున్న అమ్మమ్మతో "అమ్మమ్మా! సినిమాకి వెళుతున్నాను" అని బైట నుండే కేక వేసి ఒక్కపరుగు తీశాను.

కొత్తగా రిలీజయిన War of Worlds చూసివచ్చేసరికి రాత్రి పదయింది. నక్కుతూ, నానుతూ ఇంట్లోకి వెళ్ళేసరికి నాన్నగారు లేచి వచ్చి, చెవి మెలేసి "వెధవా! పరీక్షలు రెండు రోజులుంటే ఈ తిరుగుళ్లేమిటిరా?" అని వీపుమీద వడ్డించారు. స్వర్గానికెళ్ళినా సవితిపోరు తప్పదన్నట్లు, అన్నయ్య లేకపోయినా నాకు జరగవలసిన పూజ తప్పలేదు.

* * *

నా పరీక్షలయి కొలరోజులు గడిచాయి. అన్నయ్య లేకపోవటం వల్ల ఇష్టంవచ్చినట్టుగా తిరిగాను. రేపు అన్నయ్య వస్తున్నాడని ఉత్తరం వచ్చింది; నా రిజల్ట్సు కూడా ఆనాడే తెలుస్తాయన్న తాజావార్తకూడా చెవిలోదూరింది. నాకు గుండెదడ పుట్టింది- అన్నయ్య వస్తున్నాడు; మన పప్పు ఉడకదు, అనుకొని. రానేవచ్చాడు అన్నయ్య, దిగులు మొగంతో. 'ఏదో అయింది' అనుకున్నాను.

నాన్నగారు "ఏరా! నువ్వెళ్ళిన పనేమయింది? ఐటాచార్జిగారు ఉద్యోగం ఇస్తానన్నాడా?" అని అడిగారు.

"లేదు నాన్నా! మొదట అతని తీరుచూసి ఇస్తాడనుకున్నాను. కాని అంతలో ప్లేటు మార్చేశాడు. 'అబ్బాయ్! నీకు చదువుంది; విజ్ఞానం ఉంది. కాని పెర్సనాలిటీ లేదు. అంచేత ఈ సంవత్సరం ఇంట్లో కూర్చొని మంచి బలకరమైన ఆహారం తీసుకో. వచ్చే సంవత్సరం కనపడు, తప్పకుండా ఉద్యోగం ఇస్తా' అన్నాడు. అలా అనటానికి కారణం ఇది. అతని తాలూకు దగ్గరవాళ్ళ నెవరినో నేను వెడదామనుకొంటున్న ఉద్యోగంలో ఇరికించాడు. ఎలాగైనా మనం పైవాళ్లం కదూ! అంచేత మంచి మాటలతో సాగనంపాడు." అని తన ఉపన్యాసం ముగించాడు అన్నయ్య.

"పోనీలే. వచ్చే సంవత్సరమే వెడుదువు గాని" అన్నారు నాన్నగారు. ఇంతలో పక్కింటి వెంకటేశు వచ్చాడు నా రిజల్ట్సు తెలుసుకొని.

"ఓయి రామకృష్ణా! నీ పరీక్ష పోయిందోయ్" అని చావుకబురు


## పిల్లల పుస్తకాలు

| | | |
|---|---|---|
| గాంధీతాత | గొర్రెపాటి | రూ. 1 0 0 |
| నవ్వులు పువ్వులు | ,, | 0 8 0 |
| జాబిల్లి పాటలు | చిరంజీవి | 0 8 0 |
| చంద్రం | కె. సభా | 1 4 0 |
| దాసు | రావి కొండలరావు | 1 4 0 |
| అన్నదమ్ములు | కనక మేడల | 1 4 0 |
| గోపి మోహిని | చింతా దీక్షితులు | 1 0 0 |
| రతనాల నవ్వు | శ్రీ వాత్సవ | 1 4 0 |
| సిండరిల్లా | ఏడిద కామేశ్వరరావు | 1 4 0 |
| ఏడుగురు మరుగుజ్జులు | ,, | 1 4 0 |
| బడిపిల్లలు 40 బొమ్మలతో | | 1 8 0 |
| వీధి గాయకుడు | చిరంజీవి | 1 4 0 |
| బాలానంద కథలు 24 భాగాలు: | | |
| | భాగం 1-కి | 0 8 0 |
| బాలానంద నాటికలు 6 భాగాలు: | | |
| | భాగం 1-కి | 0 12 0 |
| విజ్ఞాన కథలు | టాల్‌స్టాయ్ | 0 8 0 |

జ్యోతి కవితామండలి, విజయవాడ-2.



తోటికోడళ్ళు

బహుమతి పొందిన చిత్రం

బి. సుబ్బలక్ష్మి (12-సం॥)—విజయనగరం

మెల్లగా చెప్పాడు. నా పరీక్ష చెట్టెక్కింది అని వినేసరికి నా కాళ్ళు వణుకు పుట్టాయి. చివరలో...... 'గిర్రు'..మని కళ్ళు తిరిగాయి. పరీక్ష పోయిందని విన్న నాన్నగారు వచ్చి "ఏరా! వెధవా! శ్రద్ధగా చదవరా, అంటే చదివావు కాదు. పరీక్ష పోగొట్టుకున్నావు. ఏం చేస్తావ్. చదివించేది దండుగ." అన్నారు. అన్నయ్య మాత్రం ఒక్క ముక్క కూడా అనలేదు. ఎందుకంటారూ! వాడు వెళ్ళిన పని కూడా సున్నా చుట్టిందికదూ!

లోపల అమ్మ అంటోంది కూర తరుగుతూ. "పెద్దాడికి ఉద్యోగమూ రాలేదు. చిన్నవాడి పరీక్షా పోయింది. హుం...కాలం..."

అవును. నిజమే. అన్నయ్యకి ఉద్యోగం - నా చదువు రెండూ రెండో ఏటికి పోయినా వచ్చాయి. బాగా కుదిరింది - అనుకున్నా గూట్లోని పాత పుస్తకాలు బూజు దులుపుతూ.

★